ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5★★
జగిత్యాల
జిల్లా వార్తలు
శనివారం 18 అక్టోబరు 2025

మండల వ్యవసాయ అధికారిగా ఎన్ తిరుపతి



బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతి

బీర్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా తిరుపతి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏఈవోగా విధులు నిర్వహించిన తిరుపతి ఇటీవల ఏవోగా ప్రమోషన్ పొంది బీర్‌పూర్ ఏవోగా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మండలంలోని కొల్వాయి సహకార సంఘంను సందర్శించి ఎరువుల వివరాలు తెలుసుకున్నారు. రైతులకు వరి కోతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు వినోద్, శిరీష, సీఈవో రాజేందర్, రైతులు తదితరులు ఉన్నారు.

ప్రోత్సాహకం కోసం తప్పని ఎదురుచూపులు
- కులాంతర వివాహాలు చేసుకున్న వారికి నిరాశ
- సకాలంలో విడుదల కాని నిధులు
- జగిత్యాల జిల్లాలో 205 జంటల నిరీక్షణ

7

రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

8



ఉపాధ్యాయులకు బోధనేతర భారం

- పాఠశాలల తనిఖీలకు ఉపాధ్యాయ కమిటీలపై వ్యతిరేకత
- ప్రభుత్వ ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల అసంతృప్తి
- కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయి తనిఖీ కమిటీలు
- 50 ఉన్నత పాఠశాలలకు ఒక కమిటీ
- 100 పీఎస్, యూపీఎస్‌ల తనిఖీకి మరో బృందం
- ఉన్నత పాఠశాలల్లో సిలబస్‌పై ప్రభావం

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీకి ఉపాధ్యాయుల కమిటీల ఏర్పాటుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వగా ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అసలే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో తనిఖీలకు ఉపాధ్యాయులతో కమిటీలు వేయడం ద్వారా ప్రతిభ కలిగిన వారు కమిటీలకు వెళితే అక్కడ పాఠాలు ఎవరు చెబుతారనేది జవాబు దొరకని ప్రశ్నంగా మారింది. తనిఖీ బాధ్యతలు తీసుకున్న టీచర్లకు ఇక బడికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. దీంతో సర్కారు బదుల పరిస్థితి మరింత దిగజారే ప్రమాదముందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

● కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు..

పదేళ్ల సీనియారిటీ ఉన్న ఉపాధ్యాయులతో కమిటీలు వేయాలని విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తనిఖీల కమిటీలు వేయనున్నారు. ప్రతీ వంద ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక్కటి చొప్పున ప్రతీ 50 ఉన్నతపాఠశాలలకు ఒక కమిటీని నియమించనున్నారు. ఈ లెక్కన జిల్లాలో 737 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 466 ప్రాథమిక పాఠశాలు, 82 ప్రాథమికోన్నత పాఠశాలలు, 189 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలకు ఐదు కమిటీలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక కమిటీ, ఉన్నత పాఠశాలలకు నాలుగు కమిటీలు జిల్లాలో వేసే అవకాశం ఉంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత కమిటీల్లో ప్రధానోపాధ్యాయుడితో పాటు స్కూల్ అసిస్టెంట్, ఇద్దరు టీచర్లు ఉండనున్నారు. హైస్కూల్ కమిటీల్లో నోడల్ అధికారితో పాటు ఎనిమిది మంది సభ్యులు ఉండనున్నారు.

● బోధనకు దూరం..

కమిటీల్లో నియమితులయ్యే ఉపాధ్యాయులు బోధనకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు బోధనకు దూరమైతే పాఠశాలల పరిస్థితి ఏమిటనేది తేలాల్సి ఉంది. ఉపాధ్యాయులపైనే ఉపాధ్యాయులు తనిఖీల కమిటీలతో పెత్తనంపై ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ కమిటీల వల్ల ఉపాధ్యాయుల్లో విభేదాలు పెరిగి లాభం కంటే నష్టం ఎక్కువగా జరిగే అవకాశాలు ఉంటా యనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో...

- మిగతా 8లో

తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తాం

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల తనిఖీకి బృందాలను ఏర్పాటు చేస్తాము. కలెక్టర్ ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. తనిఖీ బృందాలకు ప్రతీ ఒక్కరు సహకరించాలి.

- రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

పత్తి విక్రయించే విధానంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

ధర్మపురి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మెనాల గ్రామంలో జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ పంట విక్రయాలు, కోతలపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ రైతులకు పత్తిని సీసీఐకి అమ్మే విధానం గురించి అవగాహన కల్పించారు. సీసీఐ కేంద్రానికి తీసుకుపోవడానికి ముందుగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే విధానం గురించి ఆయన వివరించారు. వరి పంట కోతలకు హార్వెస్టర్‌లు తీసుకునే జాగ్రత్తల గురించి ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ఏఈవో నవ్య, రైతులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి

వెల్గటూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పత్తి పండించిన రైతులు తమ యొక్క పత్తిని సీసీఐ కి అమ్మాలంటే ముందుగా రైతులు వ్యక్తిగతంగా కపాస్ కిసాన్ అనే మొబైల్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సాయి కిరణ్ ఒక ప్రకటనలో సూచించారు. కపాస్ కిసాన్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని తమ మొబైల్ నంబర్ తో లాగిన్ కావాలని, స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం స్లాట్ బుక్ అయిన తేదీన మాత్రమే మిల్లుకు పత్తిని తీసుకొని వెళ్లాలని, స్లాట్ బుక్ చేసుకోకుండా వెళ్లితే పత్తి కొనుగోలు చేయరని అన్నారు. పత్తి వేసిన రైతుల ఫోన్ నంబరు అక్టివేషన్ లేని వారు ఫోన్ నంబరు అప్‌డేషన్ కోసం వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

పత్తిని సీసీఐ కేంద్రంలో విక్రయించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ గోపిక రెడ్డి, నాయకులు

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పత్తిని సీసీఐ కేంద్రంలో అమ్మి ప్రభుత్వం ప్రకటించిన రూ.8110 మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పత్తిని, ఇతర ధాన్యాలను దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు తమ పత్తిని అమ్మడానికి ఈ సంవత్సరం కొత్తగా వచ్చిన కిసాన్ యాప్‌ను వినియోగించి మొబైల్ నుంచి పత్తి పంటను నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ గోళ్ల తిరుపతి, పాలకవర్గ సభ్యులు, సప్ప లింగయ్య, ద్యావ మహిపాల్ రెడ్డి, జూపాక ప్రవీణ్, గుండాటి సందీప్ రెడ్డి, బిడారి భూమయ్య, రామిండ్ల లక్ష్మణ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే సంజయ్



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజ య్ కుమార్ హైద్రాబాద్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేయడానికి మంత్రి సీతక్క హామీనిచ్చినట్లు తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో పూర్త యిన ఈజీఎస్ పనులకు సంబంధించిన బిల్లులను మంజూరు చేయడానికి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్‌కు నూతనంగా మంజూరు అయిన అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అన్నారు.

తాటిపల్లి సబ్‌స్టేషన్‌లో సాధరణ మరమ్మత్తుల కోసం శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగాదారులు సహకరించాలని కోరారు.

కొడిమ్యాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మాలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ ఆర్ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తిర్మాలాపూర్, సంద్రల్లపల్లి, దమ్మయ్యపేట, కోనాపూర్, పోతారం, సూరంపేట, రాంసాగర్, డబ్బుతిమ్మయ్య పల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ సూచించారు. ధర్మపురి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ రికార్డులు, భూ భారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తును జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మీ సేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, సర్టిఫికెట్లు ప్రజలకు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పునఃనిర్మాణ పనులకు సంబంధించిన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట జగిత్యాల ఆర్‌డీవో మధుసూదన్, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కేజీబీవీ పాఠశాల తనిఖీ..

ధర్మపురి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ బి సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్య, విద్యల పట్ల శ్రద్ధ చూపించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భోజనం నిర్వహణను, వంట సరుకుల నాణ్యతను, స్టోర్ రూమ్‌లో గల బియ్యం నాణ్యతను పరిశీలించారు. వంట నిర్వాహకులను ప్రభుత్వ ఆదేశానుసారంగా మోనూ ప్రకారం, శుభ్రమైన వాతావరణంలోనే విద్యార్థులకు వండి వడ్డించాలని ఆయన సూచించారు. పాఠశాలలో ఉన్నటువంటి ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. విద్యాలయం చుట్టు ఉన్న పరిసరాలన పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజన తీరు పట్ల కొన్ని విషయాలను తెలుసుకుని ఉపాధ్యాయుకలు తగు సూచనలు అందించారు. ఆయన వెంట జగిత్యాల ఆర్‌డీవో మధుసూదన్, డీఈవో రాము, ధర్మపురి మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, ఎంఈవో సీతాలక్ష్మి, ప్రత్యేక అధికారి అరుణ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

పెగడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పెగడపల్లి ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నంచర్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్‌తో కలసి పరిశీలించారు. అంతకుముందు నంచర్ల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

పెగడపల్లి, అక్టోబరు 17 ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను అర్హులైన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి మండల సూపర్‌వైజర్ మహేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సుద్దపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం వేడుక ఘనంగా నిర్వహించారు. పోషణ మాసోత్సవంలో బాగంగా అక్షరాభ్యాసం నిర్వహించి, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి నియామకం

- ఏఐసీసీ పరిశీలకుడు, మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్ - జగిత్యాలలో అభిప్రాయ సేకరణ

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా రథసారథుల నియామకం పారదర్శకంగా చేపట్టామని, కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు, మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపంలోని ఓ పంక్షన్ హాలులో డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, నేతల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలక చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. పలువురు ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యకర్తలు, నేతల అభిప్రాయాలను సేకరించారు. పలువురు కార్యకర్తలు లిఖిత పూర్వకంగా తమ అభిప్రాయాలను ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు, మాజీ ఎంపీ డాక్టర్ జయ కుమార్ మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, బీజేపీ ప్రభుత్వంలో భద్రత కొరవడింద న్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు.

అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలుపవచ్చన్నారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలను సేకరించి నిర్ణయం తీసుకుంటామన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించాలన్నారు. ఆది నుంచి కాంగ్రెస్‌లో పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి పనిచేసిన కార్యకర్తలు, నేతలకు సరియైన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు, సీనియర్ నాయకులు కల్వకుంట్ల సుజిత్‌రావు, వాకిడి సత్యంరెడ్డి, టీపీసీసీ పరిశీలకులు మహ్మద్ ఖాజా ఫకీరోద్దీన్, కేతూరి వెంకటేశ్, గిరిజ శెట్కార్, జనగామ జిల్లా పీసీసీ పరిశీలకులు ఎండీ అవేజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి 36 మంది దరఖాస్తులు

డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తూ జిల్లా వ్యాప్తంగా 36 మంది దరఖాస్తులను సమర్పించినట్లు ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్ వెల్లడించారు. డీసీసీ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగ్‌రావు, కల్వకుంట్ల సుజిత్ రావు, గాజెంగి నందయ్య, వాకిడి సత్యం రెడ్డి, కొమిరెడ్డి విజయ్ ఆజాద్, కొమిరెడ్డి కరం, కొమిరెడ్డి లింగారెడ్డి, షేర్ నర్సారెడ్డి, గుంటి జగదీశ్వర్, ఎండీ షాకీర్ సిద్ధిఖీ, అబ్దుల్ హఫీజ్, చెదలు సత్యనారాయణ, అల్లె పాండురంగ, పట్నం శేఖర్, గడ్డం రాజేశం, ముస్కు నిశాంత్ రెడ్డి, కూన భార్గవ్, పోగుల శ్రీనివాస్, తొట్ల అంజయ్య, రుత్త నారాయణ, లక్ష్మీ నారాయణ, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, అందె మారుతి, సంగనభట్ల దినేష్, వేముల సుభాష్, పుప్పాల వనిత, రాజేశం, శైలేందర్, పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి, అందె లలిత, రాజేశ్వరీ, మమత, బండ భాస్కర్ రెడ్డి, కూన రాకేశ్, మదన్‌కుమార్, కృష్ణలు దరఖాస్తులు సమర్పించినట్లు ప్రకటించారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు, మాజీ ఎంపీ జయకుమార్

ద్విచక్రవాహనం, కారు ఢీ

● యువకుడి మృతి

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టగా ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం శాంతాపూర్‌కు చెందిన బెక్కం సతీష్(35) అనేవ్యక్తి తన ద్విచక్ర వాహనంపై లక్షెట్టిపేట వైపు వెళ్లతున్నాడు. అదే సమయంలో ఏపీ 25హెచ్ 2255 నంబరు గల కారు ఎదురుగా వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. ఈ సంఘటనలో సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికురాలి మృతి

కరీంనగర్ క్రైం/టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జ్యోతినగర్ పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్ నగర్‌కు చెందిన మున్సిపల్ స్వీపర్ బదుగు రేణుక(57) విధినిర్వహణలో ఉండగా ఉదయం 10గంటల ప్రాంతంలో జ్యోతినగర్ పెట్రోల్ బంక్ నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వేగంగా ఆమెను ఢీకొట్టాడు. దీంతో రేణుక తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన రేణుకను ఆసుపత్రికి తరలించగా 11:40గంటలకు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి తక్షణ సహాయం కింద 20వేల రూపాయల నగదు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో సుమన్, శానిటరీ సూపర్‌వైజర్లు శ్యామ్‌రాజ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య


జ్యోతి (ఫైల్)

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదువుతున్న ఓ యువతి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికిచెందిన బోయిన జ్యోతి(21) డిగ్రీ సెకండియర్ చదువుతోంది. గురువారం రాత్రి జ్యోతి పురుగుల మందుతాగింది. తల్లిదండ్రులు గుర్తించివెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం పదిగంటలకు చికిత్సపొందుతూ మృతిచెందింది. తన కూతురు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడానికి మృతురాలి స్నేహితుడి ప్రేమ వేధింపులే కారణమంటూ తల్లి బోయిని రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణం మృతురాలి కాలేజీ స్నేహితుడా లేక గ్రామానికి చెందిన స్నేహితుడా అనేది దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


జంగరాజు (ఫైల్)

రామగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన జంగరాజు(38) అనే యువకుడు బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజును హుటాహుటిన వరంగల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య జంగ స్రవంతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్స్ అందజేత


బాధితులకు సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 4సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వాటిని యజమానులకు అప్పగించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన కాత రాజకుమార్ ఆరునెలల క్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రికవరీ చేసి ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బాధితుడు రాజకుమార్‌కు అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లయితే సీఐఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.



కారుణ్యంపై కనికరమేది?

● ఉపాధి లేక రోడ్డున పడుతున్న కుటుంబాలు
● ప్రభుత్వ కాలయాపనతో ఆందోళన
● ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి

వేములవాడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగి మరణించినా, మెడికల్ అన్‌ఫిట్ అయిన సందర్భంలో ఇచ్చే కారుణ్య నియా మకాలపై ఎన్నో కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటంబానికి జీవనాధారం కల్పించేందుకు ఆ కుటంబంలో అర్హత గలిగిన ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. కారుణ్య నియామకాలపై కాలయాపన జరుగుతుండటంతో ఉద్యోగి కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని కారుణ్య నియామకాలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

నియామకాలకు ఎవరు అర్హులు :

ప్రభుత్వ ఉద్యోగులు మరణించినా లేక ఆరోగ్య సమస్యలతో ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉండేందుకు కుటుంబంలో అర్హత గల ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి వారసులు, వైద్య కారణాలతో రిటైర్‌మెంట్ తీసుకున్న ఉద్యోగి వారసులు, ఏడేళ్ల పాటు కనిపించకుండా పోయిన ఉద్యోగి వారసులు కారుణ్య నియామకానికి అర్హులు.

కారుణ్య నియామకాల విధి విధానాలు

కారుణ్య నియామకాలు ఎవరికిస్తారన్న అనుమానాలు చాలా మందికి ఉంటాయి. దానికి విధివిధానాలు ఉన్నాయి. ఉద్యోగి భార్య లేదా భర్త, లేదా కుమారుడు, కుమార్తెలు ఉద్యోగానికి అర్హులు అవుతారు. ఉద్యోగి మరణించిన నాటికి 5 సంవత్సరాల ముందు చట్టబద్ధంగా దత్తత తీసుకున్న కుమారుడు లేదా కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి భార్య, భర్త నియామకానికి ఇష్టపడిన సందర్భంలో ఆ కుటుంబంపై ఆధారపడిన వివాహిత కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి అవివాహితుడై మరణించినట్లయితే అతని సోదరుడు, సోదరికి కారుణ్య నియామకం కల్పించవచ్చు.

ఏ పోస్టుల్లో నియమిస్తారు :

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో గానీ అంతకన్న తుక్కువ గానీ కారుణ్య నియామకాలను ఇవ్వవచ్చు. ఆ పోస్టుకు స్కేల్‌కు మించని పోస్టులో గానీ అంతకన్న తక్కువ పోస్టులో గానీ నియమించే వెసులుబాటు ఉంటుంది.

నియామకపు విధానం :

ఉద్యోగి మరణించిన ఏడాదిలోపు అతని కుటుంబ సభ్యులు నియామకం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. ఆయా పోస్టులకు సంబంధించిన సరైన అర్హత కలిగి ఉండాలి. జూనియర్ అసిస్టెంట్ ఐతే తప్పనిసరిగా ఇంటర్మీడియట్ చేసి ఉండాలనే నిబంధన ఉంటుంది. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి పనిచేసిన యూనిట్‌లో నియామకం చేస్తారు. కలెక్టర్ ఇతర డిపార్టుమెంట్‌లకు కేటాయించవచ్చు. ఖాళీలు లేని సందర్భంలో కలెక్టర్ ఒక క్యాలెండర్ సంవత్సరంలో 5 వరకు సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించే అధికారం కలెక్టర్‌కు ఉటుంది.

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు నాలుగో తరగతి ఉద్యోగుల కుటుంబాలకు రూ. 40 వేలు, నాన్ గెజిటెడ్ వారికి రూ. 60 వేలు గెజిటెడ్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.80 వేలు ఏక్స్‌గ్రేషియా చెల్లించవచ్చును.

ప్రభుత్వం కారుణ్య నియామకాలపై దృష్టిసారించాలి

బూర సదానందం, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్..



ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా, కారణాలతో మృతి చెందిన వారు, అనారోగ్యంతో ఉద్యోగానికి దూరమైన వారి కుటుంబ సభ్యులకు జీవో ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి. ఉపాధ్యాయుల సమస్యలపైన ప్రభుత్వం దృష్టిసారించాలి. ఉపాధ్యాయులను కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి..

దిక్కుతోచని స్థితితో కుటుంబాలు

వంగ తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మరణించిన వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఉద్యోగాలు కల్పిస్తే మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునే అవకాశం కల్పించినట్లు ఉంటుంది.

నాన్న మృతి చెంది సంవత్సరం దాటింది..

పూరేల్లి కల్పన, మరణించిన ప్రభుత్వ ఉద్యోగి కూతురు



మా నాన్న పూరేల్లి రవీందర్ వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో హెచ్ఎంగా పనిచేశారు. మా నాన్న అకాలమరణం చెంది సంవత్సరం దాటుతుంది. కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఉద్యోగం ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఎంబీఏ పూర్తి చేసి ఉన్నాను.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోతెవాగు పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వన్నారం, మోతె నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి వివిధ గ్రామాలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ కె రాజు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మల్లాపూర్ : మండలంలోని చిట్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని మల్లాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలోని గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలించిన, నిల్వచేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గోదావరినది పరివాహక గ్రామాలతో పాటువాగుల నుంచి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా ఇసుకను తరలించినా, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రసమయి ఫాంహౌస్‌పై దాడికి యత్నం

● వివిధ మండలాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు ● అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత


పగిలిన ఫాం హౌస్ కిటికీ అద్దాలు

బెజ్జంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు చెందిన ఫాంహౌస్‌పై కాంగ్రెస్‌కార్యకర్తలు శుక్రవారం దాడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నంలో ఉద్రిక్తత నెలకొంది. పలువురు కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు ఒకరిపై మరొకరు విమర్శలు, దూషణలు చేసుకున్న ఓఆడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రసమయి వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం అన్నిమండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మండలంలోని గుండారం గ్రామంలోని రసమయి బాలకిషన్‌కుచెందిన ఫాంహౌస్‌ను ముట్టడించేందుకు నియోజకవర్గంలోని బెజ్జంకి, ఇల్లంతకుంట, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌నాయకులు వివిధమార్గాల్లో వచ్చారు. విషయం తెలిసుకున్న పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కొందరు ఫాంహౌస్‌పైకి రాళ్ల విసిరారు. దీంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈక్రమంలో పోలీసులు పలువురి అదుపులోకి తీసుకుని బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిద్దిపేట రూరల్‌సీఐ శ్రీను, ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. కాంగ్రెస్‌నాయకులు రసమయికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే సత్యనారాయణకు.. రసమయి బాలకిషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న నాయకులు, కార్యకర్తల వద్దకు ఎమ్మెల్యే సత్యనారాయణ చేరుకొని వారితో మాట్లాడి మాజీఎమ్మెల్యే రసమయిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు స్థానిక ఎడ్లబండి చౌరస్తాలో రసమయి బాలకిషన్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన


హాజరైన విద్యార్థులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమరవాణా, లైంగిక వేధింపులు, పిల్లలతో భిక్షాటన, కూలీ పనులు చేయించడం, అవయవ దోపిడీ, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన టాస్క్‌ఫోర్ ఎస్సై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరీంనగర్ మానవ అక్రమరవాణా నియంత్రణ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఇన్‌చార్జి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సురేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ ఐటీ టవర్ సమీపంలోని టీజీ ఎంప్లాయిబిలిటీ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో విద్యార్థులకు పైఅంశాలపై వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడి

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. గురువారం సాయంత్రం గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ దొరికిన వారిని కాళ్లు, చేతులు, ఇంటి ఆవరణలో కూర్చున్న వారి వీపులపై తీవ్రంగా కరిచింది. రక్తస్రావమైన బాధితులు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. అయితే ఒకే కుటుంబంలో తల్లీ ఇద్దరు కూతుళ్ల వాకిట్లో కూర్చోగా వారిపై విరుచుకుపడింది. కుక్క బారినుంచి తప్పించుకునేందుకు తల్లీ కూతుళ్లు ప్రయత్నించినా తల్లిని వీపుపై కూతుళ్లను కాళ్లు, చేతులపై కరిచింది. పిచ్చికుక్క బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటి ప్రహరీని ఢీకొట్టిన కంటైనర్

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్షకుర్తిలో కంటైనర్ అదుపు తప్పి ఇంటి ప్రహరీతోపాటు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడగా అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి భారీ కంటైనర్ విజయవాడ వెళ్తోంది. డ్రైవర్ మద్యం మత్తులో దారి తప్పి గర్షకుర్తి మీదుగా వాహనాన్ని మళ్లించాడు. గర్షకుర్తిలో రోడ్డు పక్కన ప్రహరీ, ఆ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని డీకొట్టాడు. దీంతో గోడకూలి విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరాను నిలిపివేశారు. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసూరి శంకరయ్య(58) కొంతకాలంగా అప్పులతో ఆర్థికంగా బాధపడుతున్నాడు. ఈనెల 16న పనికి వెల్లుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. రెండు రోజులైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు అదృశ్యం అయినట్లు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మంథని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వ్యాపారాల పేరుతో పెట్టుబడి పేరిట పలువురి వద్ద భారీగా అప్పులు తీసుకొని మోసాలకు పాల్పడిన బందం చంద్రశేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడు మంథనికి చెందిన బండారి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి గోదావరిఖని కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. నిందితుడు చంద్రశేఖర్ మంథని చెందిన దాదాపు 25 మంది వద్ద వ్యాపార పెట్టుబడిల పేరిట వడ్డీ ఎక్కువగా ఇస్తానని నమ్మించి దాదాపు 5-6కోట్లు వసూలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. మరికొందరు బాధితులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.6800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6800 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 159మంది రైతులు 1238 క్వింటాళ్ల విడిపత్తి, 31మంది రైతులు 43క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికితీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.6800, కనిష్ఠధర రూ.4800 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

నిప్పంటుకొని వంట సామగ్రి, దుస్తులు దగ్ధం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎం శాంత అనే మహిళ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. శాంత ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇంట్లో నిప్పంటుకుని సామన్లు, దుస్తులు దగ్ధమయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఇంటితాళం పగుల గొట్టి మంటలార్పారు. రామగుండం రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రూ.10వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

రైస్‌మిల్లులో ఇసుక అక్రమ నిల్వ

● గుట్టుగా సాగుతున్న దందా
● పట్టుకున్న సిబ్బందిని నెట్టేసి టిప్పర్లతో సహా పరార్


కోరుట్లలో పట్టుబడ్డ ఇసుక లారీ

కథలాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో కోరుట్లకు వెళ్లేదారిలో ఉన్న రైస్‌మిల్‌లో వడ్లను నిల్వచేయడానికి బదులు ఇసుక డిపోగా మార్చేశారు. కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ దందా కొనసాగుతున్నట్లు రెవెన్యూ అధికారులు పక్కాసమాచారం అందుకుని గురువారం రాత్రి అకస్మికంగా దాడులు చేశారు. ఆ సమయంలో రెండు టిప్పర్లలో ఇసుకను నింపుతుండగా సిబ్బంది పనులను నిలిపివేశారు. ఒక్కసారిగా డ్రైవర్లు సిబ్బందిని నెట్టేసి టిప్పర్లను స్టార్ట్ చేసుకుని కోరుట్ల వైపు పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడ పట్టుకుని ఆర్టీసీడిపో శివారులో నిలిపి వేశారని తెలిసింది. రైస్‌మిల్ యజమాని తక్కళ్లపల్లి శివారులో ఉన్న పెద్దవాగు నుంచి ట్రాక్టర్లతో ప్రతీనిత్యం రైస్‌మిల్లుకు ఇసుకను తరలించి నిల్వ చేస్తున్నాడు. భారీ డంపులు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో టిప్పర్లలో ఆర్మూర్, నిర్మల్ వంటి ప్రాంతాలకు తరలించి అక్రమదారుల్లో సొమ్ము చేసుకుంటున్నాడని అధికారులకు సమాచారం అందింది. ఈక్రమంలో దాడులు చేసి అక్రమ వ్యవహారాన్ని రెవెన్యూ అధికారులు రట్టు చేశారు. కాగా గురువారం రాత్రి నిల్వఉన్న ఇసుకను ట్రాక్టర్ల సహాయంతో మరో చోటుకు రైస్‌మిల్ యజమాని తరలించినట్లు తెలుస్తోంది.

మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం గాలింపు

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్‌తో పాటు జిల్లాలో పలుప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపడుతున్నట్లు డీఎస్పీరఘుచందర్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. బంగారం, నగదు ఇంట్లో ఉంచుకోరాదని బ్యాంకుల్లో పెట్టాలని ప్రజలకు డీఎస్పీ రఘుచందర్ సూచించారు. వేరే గ్రామాలకు తీర్థయాత్రలకు వెళ్లినపుడు పొరుగింటి వాళ్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని డీఎస్పీ చెప్పారు. దొంగతనాలను అరికట్టడానికి గస్తీ ముమ్మరం చేశామన్నారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన టేకు కలప పట్టివేత


పట్టుకున్న టేకు కలప దుంగలు

రుద్రంగి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన టేకు కలపను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. పోలీసులు పట్టుకున్న టేకు కలపను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రాఘవేంద్రరావు కథనంప్రకారం.. రుద్రంగి మండల కేంద్రంలోని గంగారెడ్డి ఇంట్లో అక్రమంగా టేకుకలపను నిల్వచేసి నట్లు విశ్వసనీయ సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 35టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న టేకు కలపను కొలతలు చేపట్టి కలప విలువ ప్రకటిస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డ వాహనం

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి రాజీవ్‌రహదారిపై అక్రమంగా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సివిల్‌సప్లై అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం గుండ్లపల్లి రాజీవ్ రహదారి వద్ద సివిల్ సప్లయి అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న బొజ్జ రాజును, పికప్ వాహనాన్ని పట్టుకున్న సివిల్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సివిల్‌సప్లై అధికారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్లు చోరీ


డైనింగ్‌హాల్‌లో కనిపించని సీలింగ్ ఫ్యాన్లు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోగల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో డైనింగ్‌హాల్ ముందు ఉన్న ఆరు సీలింగ్‌ఫ్యాన్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేశారు. తొమ్మిదవ తరగతిగది ముందు స్టార్ గుర్తువేసి కోడిగుడ్లు, నిమ్మకాయలు, పసుపు, మిర్చి, కుంకుమ, బొగ్గుతో క్షుద్ర పూజలు జరిపారు. ఫిర్యాదు అందుకున్న పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పాఠశాల వద్ద పహారాకోసం ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీ కొట్టిన ఆటో: ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై కారును వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి వీరయ్య కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణబ్యాంకులో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి ఆటోలో వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నం బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న కారును ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న వీరయ్యకు ఎడమ పక్కన భుజానికి తీవ్ర గాయం కాగా, కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని వీరయ్యను 108లో చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



సైదాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బొడిగె లహరి ఎస్ జీఎఫ్ అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, ఉపా ధ్యాయుడు హన్మండ్ల భాస్కర్ తెలిపారు. విద్యార్థిని ఈనెల 18నుంచి 20 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిరుమలపూర్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొటుందన్నారు. లహరిని హన్మండ్ల భాస్కర్ అభినందించారు.

తాటిపల్లి గురుకుల విద్యార్థిని..



మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం దర్శిని రాష్ట్రస్థాయి పాఠశాలల వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కొదురుపాకలో జరిగిన అండర్-17 విభాగం పోటీలలో ఎం దర్శిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినిని ఎంఈవో జయసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు..







సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కే అక్షిత్, కే సాయిచరణ్ సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్- 19 వాలీబాల్ పోటీలకు అక్షిత్, సాయిచరణ్ ఎంపిక య్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కనక విజయ రఘునందన్, కళాశాల క్రీడల ప్రతినిధి కనకయ్య, అధ్యాపకులు, సిబ్బంది అక్షిత్, సాయి చరణ్‌ను అభినందించారు.

● **కోనరావుపేట:** కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడి యట్ చదువుతున్న విద్యార్థి సాల్వల క్రాంతి రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైన ట్లు ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరచగా రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని క్రాంతిని అధ్యాపక బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో వెల్గటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నందయ్య, పీడీ రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలో భాగంగా ఈ నెల 16న మల్యాలలోని ఎస్ఎస్‌వీ ఆల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెల్గటూరు విద్యార్థులు గజ్జెల శ్రీవిద్య, బోరె జాశ్విత్, బట్టు గ్రీష్మ టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరిచి ఈనెల 22న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నందయ్య,పీడీ రాజ్‌కుమార్, టేబుల్ టెన్నిస్ ఆర్గనైజేషన్ కన్వీనర్ రాజమల్లయ్య, అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ శ్రీకాంత్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మలత, కొండాల్ రెడ్డి పాల్గొన్నారు.


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రోత్సాహం కోసం తప్పని ఎదురుచూపులు



● కులాంతర వివాహాలు చేసుకున్న వారికి నిరాశ
● సకాలంలో విడుదల కాని నిధులు
● జగిత్యాల జిల్లాలో 205 జంటల నిరీక్షణ

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ వివాహాలు చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందడంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహక సొమ్ము కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. కులాంతర వివాహాలు చేసుకుంటే ప్రోత్సాహకాలు అందిస్తామన్న ప్రభుత్వం ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదు. షెడ్యూల్ కులానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయి ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఇది వరకు రూ.50 వేలు ఉన్న ఆర్థికసాయాన్ని గత ప్రభుత్వం 2019 నవంబరులో రూ.2.50 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

కానీ ఆదర్శ దంపతులకు సంబంధించిన ప్రోత్సాహకాలకు నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడంలేదు. వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సాయం సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో ఆదర్శ వివాహాలు చేసుకున్న 253 జంటలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో 68 జంటలకే ప్రభుత్వ సాయం అందింది. ఇంకా 205 జంటల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

నిధులు రాగానే అందజేస్తాం

రాజ్‌కుమార్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జగిత్యాల



ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. జిల్లాలో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అర్హులైన జంటలకు అందించి జీవితంలో స్థిరపడేలా కృషి చేస్తున్నాం.



అర్హులు వీరే..

కులాంతర వివాహం చేసుకున్నవారు ఆర్థిక సాయం పొందాలంటే పలు అర్హతలు కలిగి ఉండాలి. దంపతుల్లో ఒకరు తప్పకుండా షెడ్యూల్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందినవారై ఉండాలి. అమ్మాయికి 18 ఏళ్లు కచ్చితంగా నిండి ఉండాలి. వివాహం చట్ట ప్రకారం రిజిష్టర్ అయి ఉండాలి. పెళ్లయిన జంట వార్షిక ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువగా ఉండాలి. మొదటి వివాహానికి మాత్రమే ఈ ప్రోత్సాహకం అందుతుంది. వివాహమైన ఏడాది లోపు జిల్లా షెడ్యూ ల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం అందుతుంది. కాగా జగిత్యాల జిల్లాలో కులాంతర ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులు ప్రభుత్వ సాయం కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా, నిధులు తక్కువగా విడుదల చేయడం వల్ల అర్హులందరికీ అందడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 లక్షలు ఇస్తుండడంతో కులాంతర వివాహం చేసుకున్న కొంత మంది జంటలు కల్యాణలక్ష్మి వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయాలని కులాంతర వివాహాలు చేసుకున్న పలువురు దంపతులు కోరుతున్నారు.

సింగరేణి మెడికల్ కళాశాలకు 16 పీజీ సీట్ల మంజూరు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో 16పీజీ సీట్లను మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసినట్లు సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్-4, ఎంఎస్ అబ్స్ట్రిక్ గైనకాలజిస్ట్-4, ఎంఎస్ ఆర్థోపెడిక్-4, ఎండీ బయో కెమిస్ట్రీ-4 మొత్తం 16 సీట్లను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఏడాది క్రితం సిమ్స్ కళాశాలలో పీజీ సీట్లు మంజూరు చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ప్రిన్సిపాల్ హిమబిందు దరఖాస్తు చేశారు. ఎంబీబీఎస్ 4 సంవత్సరంలో అడుగుపెడుతున్న సిమ్స్ మెడికల్ కళాశాలలో అన్నీ వసతులు ఉండడంతో పీజీ విద్యార్థులకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండడంతో 16సీట్లను మంజూరు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ ఐదు డిపార్ట్‌మెంట్లలో 24సీట్ల కోసం దరఖాస్తు చేయగా జనరల్ సర్జన్, పిడియాట్రిక్ పీజీ సీట్లను పెండింగ్‌లో పెట్టారని, అవి కూడా త్వరలోనే మంజూరవుతాయని చెప్పారు. త్వరలోనే ఈ పీజీ కోర్సులకు కౌన్సెలింగ్ జరుగుతాయని, పీజీ విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్, ఇతర వసతులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన వరద

మళ్లీ తెరుచుకున్న ఎస్సారెస్పీ గేట్లు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు శుక్రవారం స్వల్పంగా పెరిగింది. దీంతో వర ద గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లను తెరిచి 12,500 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరి లోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్


అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్ వద్ద కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని గోల్డెన్ టెంపుల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శ్రీనగర్‌లో పర్యటించి శ్రీనగర్ సమీపంలోని డచ్చిగాం నేషనల్ పార్క్‌ను సందర్శించారు. సాయంత్రం పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం)ను దర్శించుకున్నారు.

మందుబాబుల హంగామా..

సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రోడ్డుపై బైఠాయింపు..

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి మందు బాబులు హంగామా సృష్టించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండల కేంద్రంలో సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఇద్దరు మందు బాబులు బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. మద్యం సేవిస్తుండగా పోలీసులు వాహనాన్ని తీసుకుని పోయారని ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సుమారు గంట పాటు హంగామా సృష్టించారు. పోలీసులు చేరుకొని పక్కకు తప్పుకోవాలని సూచించినా వినకపోవడంతో బలవంతంగా పక్కకు లాగి వేశారు.


రోడ్డుపై బైఠాయించిన మందు బాబులు

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు..

విధులకు ఆటంకం కలిగించిన అల్లెపు కనకరాజు, అల్లెపు మల్లిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు సహకరించకుండా దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శాతవాహన పరిధిలోని నేటి పరీక్షలు వాయిదా

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో శనివారం నిర్వహించనున్న ఎంఎడ్ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ రెండో సెమిస్టర్, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన ఎంఎడ్, బీఫార్మసీ పరీక్షలు అక్టోబరు 22న ఉంటాయని, ఎల్ఎల్ఎం పరీక్ష అక్టోబరు 29న ఉంటుందని, మిగిలిన పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులూ లేవని వివరించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్బన్ బ్యాంకు ఎన్నికలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలు నవంబరు 1న నిర్వహించనున్నట్లు బ్యాంకు ఎన్నికల అధికారి సీహెచ్. మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బ్రాంచి పరిధిలోని ఓటర్లు నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జగిత్యాల బ్రాంచి ఓటర్లు జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంటుందని వివరించారు.

21న శాతవాహనలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ కోర్సులో 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ తెలిపారు.

ఎంబీఏలో ప్రవేశం పొందని అభ్యర్థులు (ఐసెట్ -2025 అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులు) ఒరిజినల్ సర్టిఫికెట్లు, అవసరమైన రుసుముతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్‌లో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని పేర్కొన్నారు. 12సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటి వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

వేగంగా ఆలయ విస్తరణ పనులు..

● ప్రధాన ఆలయంలో తొలగిస్తున్న పైకప్పు రేకులు ● కొనసాగుతున్న భక్తుల దర్శనాలు



రాజన్న ఆలయంలోని పైకప్పు రేకులను తొలగిస్తున్న సిబ్బంది, కోటి లింగాల వైపు ఉన్న క్యూలైన్‌లో దర్శనానికి వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మొదటి విడతలో రూ. 74 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో రాజన్న ఆలయ ఆవరణలోని కళాభవన్, ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్, ఈవో కార్యాలయ భవనాలను కూల్చివేసి చదును చేశారు. కాగా శుక్రవారం రాజన్న ప్రధాన ఆలయంలో భక్తులకు ఎండ తీవ్రతకు, వర్షానికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసిన పైకప్పు రేకుల షెడ్డును సిబ్బంది తొలగిస్తున్నారు.

ఉత్తర ద్వారా నుంచి ఆలయంలోకి వచ్చేందుకు, బయటకు వెళ్లేందుకు, బ్రేక్ దర్శన్ క్యూలైన్‌ల వైపు పనులు జరుగుతుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రధాన తూర్పు ద్వారం పక్కన క్యూలైన్‌లా నుంచి భక్తులను అనుమతిస్తూ, కోటి లింగాల పక్కన క్యూలైన్‌ల ద్వారా అద్దాల మండపం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతినిస్తున్నారు.

భీమన్న ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ..

రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో భక్తులు భీమన్న ఆలయంలో స్వామి వారి దర్శనానికి మొగ్గు చూపుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భీమేశ్వర ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. భీమన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వందేళ్లు సరిపడేలా రాజన్న ఆలయ నిర్మాణం..

● శృంగేరి పీఠం జగద్గురుకు ఘన స్వాగతం పలకాలి
● వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని వందేళ్లు సరిపడేలా నిర్మాణం చేస్తున్నారని స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 19,20వ తేదీల్లో శృంగేరి పీఠం జగద్గురు విధుశేఖర భారతిస్వామి విచ్చేస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లపై ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిని రూ. 150 కోట్లతో చేపడుతున్నట్లు చెప్పారు. వం దేళ్ల ఆలయానికి సరి పడేలా ఏర్పాట్లను చేస్తున్నట్లు వివరించారు. రాజన్న ఆలయ అభివృద్ధే ఈప్రాంత ప్రజల, భక్తుల కల అన్నారు.

ఆలయ అభివృద్ధిలో అందరు రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈనెల 19, 20వ తేదీన శృంగేరి పీఠం జగద్గురు శ్రీ విధు శేఖర భారతి స్వామి సాయంత్రం 6 గంటలకు వేములవాడ చేరుకుంటారని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, భక్తులు, నాయకులు హాజరవు తున్నారని, అశేష జన సమూహంతో స్వామివారికి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణోత్త ముల కోరిక మేరకు శంకరమఠంలో శ్రీస్వామి వారి అభిషేక కార్యక్రమానికి హాజరవుతారని సూచించారు. పీఠాధిపతి వేములవాడ రాక ముఖ్యమైనదని, 19వ తేదిన సాయంత్రం 6గంటలకు పట్టణంలోని తెలం గాణ చౌక్‌కు అందరూ చేరుకొని స్వాగత కార్య క్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, వైస్‌ఛైర్మన్ కనికరపు రాకేష్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రాజన్న భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు

● రైతులకు ఉచితంగా రాజన్న కోడెల పంపిణీ
● శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):రాజన్నకు కోడెమొక్కు భక్తుల విశ్వాసానికి ప్రతీక అని స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు శుక్రవారం కోడెలను ఉచితంగా పంపిణీ చేశారు. గోశాలలోని కోడెల పరిస్థితిని పరిశీలించారు. కోడెలకు పచ్చిగడ్డి అందిస్తున్నారా.. లేదా.. ఆరా తీశారు. అనంతరం కోడెలకు పచ్చిగడ్డిని అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు నేరుగా కోడె లను పంపిణీ చేయడంతో వారి వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారన్నారు. రైతులు కోడెలను చక్కగా చూసుకుంటూ సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.


రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

అర్హులైన రైతులకు 102 జతల జీవాల పంపిణీ

కలెక్టర్ ఎం. హరిత

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు కలిగి ఆన్‌లైన్‌లో దరఖాస్తున్న చేసుకున్న అర్హులైన రైతులకు 102 జతల జీవాలను పంపిణీ చేశామని కలెక్టర్ ఎం. హరిత అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించి రైతుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వాటిని వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసకున్న పత్రాలను పరిశీలించి కోడెలను అందిస్తున్నామన్నారు. కోడెలు పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఎమ్మార్వో విజయ ప్రకాశ్‌రావు ఉన్నారు.


రైతుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత

రాజన్న సేవలో విప్, కాంగ్రెస్ అబ్జర్వర్


ప్రత్యేక పూజలో పాల్గొన్న విప్ మనె శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ అబ్జర్వర్ వి మనె శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

అంజన్న.. మెట్లు ఎక్కేదెలా..



మెట్ల దారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానానికి నడకమార్గాన వెళ్లే భక్తుల కోసం గల మెట్ల దారి పిచ్చి మొక్కలతో నడవడానికి ఇబ్బందికరంగా మారింది.

మెట్ల దారిని అభివృద్ధి చేయకపోవడం, తరచూ పిచ్చి మొక్కలను తొలగించకపోవడంతో ఏపుగా పెరిగిన మొక్కలతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు.

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలింపు

కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్న రైతులు

కొడిమ్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పదిహేను రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో వరికోతలు ముమ్మరమయ్యాయి. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఎదురుచూస్తున్నారు. మండలంలోని చెప్యాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి పది రోజులుగా సుమారు 90 మంది ధాన్యం తరలించినట్లు గ్రామరైతులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ వానాకాలంలో 19,500 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగుచేసినట్లు ఏవో పి. జ్యోతి తెలిపారు. మండలంలోని తిప్పయ్యపల్లి, అప్పారావు పేట, కొడిమ్యాల, సూరంపేట, గంగారాంతండా చింతల్లల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.





కొడిమ్యాల మండలం చెప్యాల, మల్యాల మండలం ముత్యంపేట కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

● **మల్యాల మండలంలో..**

మల్యాల: వానాకాలం సీజన్ వరి పంట కోతలు షురూ కావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుకుంటుంది. ఇప్పటికే మల్యాల మండలంలోని ప్రతి గ్రామంలో గల కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తుండగా రైతులు ఆరబెట్టడం, శుద్ధి చేయడం చేస్తున్నారు. త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- డబ్బు గౌతంరెడ్డి, రైతు, డబ్బుతిమ్మయ్యపల్లి



ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా సంబంధిత అధికారులు ప్రారంభించాలి. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. కేంద్రాల్లో రైతులకు మౌలిక సౌకర్యాలను కల్పించాలి.

ఉపాధ్యాయులకు బోధనేతర భారం

(5వ పేజీ తరువాయి)

తనిఖీ కమిటీల వల్ల సిలబస్ పూర్తయ్యే అవకాశం లేకుండా పోతుంది. జిల్లాలో వందకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట నుంచి ఎక్కువగా ఉన్నచోటుకి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యాబోధన నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తనిఖీ కమిటీల్లో ఉపాధ్యాయులను నియమిస్తే ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది.

రెగ్యులర్ అధికారులను నియమించాలి

- బోయినిపల్లి ఆనందరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరియైనది కాదు. విద్యాశాఖలో సంవత్సరాల తరబడి ఖాళీగా ఉన్న మండల, డిప్యూటీ విద్యాశాఖ అధికారుల పోస్టులను భర్తీ చేయాలి. అర్హులకు పదోన్నతులు కల్పించాలి. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతో తనిఖీలు చేయించడం వల్ల బోధన కుంటుపడుతుంది. రెగ్యులర్ అధికారులను నియమించాలి.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

- తులసి ఆగమయ్య, టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకుడు



గతంలో ఉపాధ్యాయుల తనిఖీ కమిటీలను నియమించాలని ప్రభుత్వం ఆలోచన చేసినప్పటికీ.. ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత రావడంతో వాయిదా వేశారు. మళ్లీ తనిఖీ కమిటీల ఏర్పాటు ఉత్తర్వులు ఇటీవల ఇచ్చారు. ఈ విధంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికే పాఠశాలల్లో సరిపడే ఉపాధ్యాయులులేక సర్దుబాటులో పాఠశాలలు నడుస్తున్నాయి. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పక్షాన సంపూర్ణ మద్దతు అందిస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన తమకు రావాల్సిన రిజర్వేషన్లను సాధించుకోవడానికి బీసీ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపును స్వాగతిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు మద్దతు ప్రకటించి బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించడానికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. సమాజంలో అధిక సంఖ్యలో గల బీసీలకు అదేస్థాయిలో హక్కులు దక్కాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అడువాల లక్ష్మణ్, జగదీశ్వర్, ధర్మపురి దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బంద్‌ను విజయవంతం చేయండి

కొడిమ్యాల/కథలాపూర్/మెట్‌పల్లిటౌన్/మెట్‌పల్లి రూరల్/రాయికల్/ మల్లాపూర్/భీమారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శనివారం నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు ప్రజలను కోరారు. శుక్రవారం కొడిమ్యాల, కథలాపూర్, మెట్‌పల్లి పట్టణం, మెట్‌పల్లి మండలం, రాయికల్, మల్లాపూర్, భీమారం మండలాల్లో బీసీ జేఏసీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా రాజు, పుప్పాల లింబాద్రి, బొడ్ల రమేష్, నర్సింగరావు, అంజయ్య, బొమ్మెల శంకర్, ఆకుల ప్రవీణ్, మొరపు తేజ, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య, సాయిరాజ్, సామల్ల సతీష్, మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, ఇమ్మడి విజయ్, తునికి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి జువ్వాడి దరఖాస్తు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న జువ్వాడి నర్సింగ్‌రావు

కోరుట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవికి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు దరఖాస్తు అందజేశారు. జగిత్యాలలో జరిగిన అభిప్రాయ సేకరణలో పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు మాజీ ఎంపీ డాక్టర్ జయ కుమార్‌కు దరఖాస్తు అందజేశారు. అనంతరం పలువురికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో రోగ నిరోధక శక్తి పెంచేందుకు, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ఉచిత గాలికుంటు నివారణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి హేమలత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింగాపూర్‌లో పశువైద్య శిబిరం నిర్వహించి గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మతిన్, ఓఎస్ వినీత్ , గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వెల్గటూర్: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించాలని మండల పశు వైద్యాధికారిణి శ్రీప్రియ సూచించారు. శుక్రవారం మండలంలోని జగదేవ్‌పేట గ్రామంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగదేవ్‌పేటలో 72 ఆవులు, ఎద్లు, 80 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసవేని హరీష్, నాగుల కిషన్, నర్సయ్య, తిరుపతి, పశు వైద్య సిబ్బంది సంధ్య, నాగరాజు, నారాయణ, చంద్రయ్య, అంజి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబసభ్యులకు మాజీ మంత్రి పరామర్శ

ధర్మపురి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ధర్మపురి పట్టణానికి చెందిన కస్తూరి జగదీష్‌చంద్ర (35) అనే పిల్లల వైద్యనిపుణుడి కుటుంబసభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. మృతుడి తండ్రి కాంగ్రెస్ నాయకుడు, జగిత్యాల పంచాయితీ సమితి మాజీ కో ఆప్షన్ మెంబర్ కస్తూరి రాంకిషన్‌ను ఓదార్చారు. అనంతరం కమలాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఉయ్యాల నాగయ్యగౌడ్ కుటుంబసభ్యులను మాజీ మంత్రి పరామర్శించారు. ఆయన వెంట కరీంనగర్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మాజీ ఎంపీపీ సౌళ్ల భీమయ్య, మాజీ కౌన్సిలర్లు బండారి అశోక్, గుర్రాల సుధాకర్, మాజీ కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అలీమొద్దీన్, సంగి శేఖర్, బండారి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సంగ కొమురయ్య మృతి చెందగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, గంగుల అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

గొల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్గిమల్ల భక్తాంజనేయ స్వామి దేవాలయంలో నవగ్రహ విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వేరువేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజ స్తంభ నిర్మాణానికి మంత్రి రూ. 10,016 విరాళంను అందజేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గోస్కుల జలేందర్, మాజీ ప్రజాప్రతినిధులు రేవెళ్ల సత్యానారాయణగౌడ్, అలిశెట్టి రవీందర్, నాయకులు బలభక్తుల కిషన్, ఓరగంటి అశోక్‌రావు, బోయపోతు గంగాధర్, గురిజాల బుచ్చిరెడ్డి, నేరెళ్ల మహేష్, సట్ట ఎల్లయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం

మల్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లిలో జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహ్మద్ ఇబ్రహీం జ్ఞాపకార్థం శుక్రవారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 55 మందికి కంటి శస్త్రచికిత్స అవసరం కాగా రేకుర్తి కంటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఉస్మాన్, అజీజ్, లయన్ వినోద్‌కుమార్, శ్రీరాముల సుదర్శన్, శంకర్, గంగాధర్, శ్రీహరి, శ్రీనివాస్, లక్ష్మనారాయణగౌడ్, లక్ష్మణ్ , రాజలింగం, అజయ్, నాంపల్లి, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మాస్ట్రో విద్యార్థి ప్రతిభ

కథలాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాస్ట్రో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బండపల్లి శ్రీరాం అనే విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరిగిన పోటీల్లో జట్టులో ప్రథమస్థానం సాధించి నేపథ్యంలో శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్ విద్యార్థిని సన్మానించారు. పీఈటీలు మల్లేశ్, లింబా, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

- ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

రాయికల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్(సీజేఐ) బీఆర్ గవాయిపై బూటు విసిరి దాడికి పాల్పడిన అడ్వకేట్ రాజేష్ కిషోర్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాయికల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. దాడి ఘటనను సుమోటోగా స్వీకరించి నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అక్టోబరు 27న లక్షలాది మందితో హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను నిర్వహించి తీరుతామని అన్నారు. అనంతరం తహసీల్దార్ నాగార్జునకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు దుమాల గంగారాం, మండల ప్రధాన కార్యదర్శి బెక్కెం వెంకటేష్, నాయకులు పాలెపు బాలరాజు, లింగంపెల్లి రాజేష్, నిఘా రాజేష్, బిరుదుల హరీష్, వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.



రాయికల్‌లో వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● **ధర్మపురి:** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్(సీజేఐ) బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చందోళి శ్రీనివాస్, జిల్లా ఎంఎస్‌పీ ప్రధాన కార్యదర్శి అరికిల్ల సతీష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పారుపెల్లి రాజమల్లయ్య, రాయిల్ల రవి కుమార్, పర్లపెల్లి లక్ష్మణ్, మోదిగం శ్రీనివాస్, మోతె ప్రభాకర్, అంతర్పుల దుబ్బయ్య పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: భారత చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై బూటు విసిరి దాడికి పాల్పడ్డ అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని జగిత్యాల రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ట్రామా కేసుల్లో ప్రతి నిమిషం విలువైనదే..



మాట్లాడుతున్న వైద్యులు సత్యనారాయణ, రాజీవ్ రెడ్డి తదితరులు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ట్రామా కేసుల్లో ప్రతీ నిమిషం విలువైనదేనని మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు అన్నారు. వరల్డ్ ట్రామా డే సందర్భంగా శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ఓ హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమర్జెన్సీ ఫిజీషియన్ సత్యనారాయణ, న్యూరో సర్జన్ రాజీవ్ రెడ్డి, క్రిటికల్ కేర్ నిపుణులు ఉపేందర్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్లు వేణుగోపాల్, రాకేష్ మాట్లాడారు. సెకన్లలో తీసుకునే వేగవంతమైన నిర్ణయం, సరైన వైద్యసహాయం రోగి ప్రాణాన్ని కాపాడగలదని అన్నారు. ట్రామా డే ద్వారా ప్రజల్లో ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం, రోడ్డు భద్రత నియమాలను పాటించడం, ప్రమాదం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా సమయానికి వైద్య సహాయం పొందడం ఎంత ముఖ్యమో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన బృందంతో, అన్ని విభాగాల సమన్వయంతో వేగవంతమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆసుపత్రికి తీసుకువస్తే వేగంగా రికవరీతోపాటు ప్రాణాలను సులభంగా కాపాడడం సాధ్యపడుతుందని తెలిపారు. సమావేశంలో గుర్రం కిరణ్, కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పక పాటించాలి

కోరుట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో ఓదెల రామకృష్ణ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని హాజీపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు పెట్టే భోజనం నాణ్యతగా ఉండాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ పాటించాలని, తరగతి గదులను, పరిసరాలను పరిశుభ్రం గా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిశత్ అంజుమ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలపై సమీక్ష

జగిత్యాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల కాలంలో జగిత్యాలలో జరిగిన శిశు మరణాలపై జగిత్యాల జిల్లా వైద్యాధికారి ప్రమోద్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇప్పటి వరకు జరిగిన 40 మరణాలలో 10 మంది చిన్న పిల్లల మరణాలపై డెత్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వైద్యాధికారులు మరణాలపై నివేదికను అందజేశారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, మాతా శిశు సంరక్షణాధికారి జైపాల్‌రెడ్డి, పిల్లల వైద్యానిపుణులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వృద్ధుడి మృతి

మల్లాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన చింతలపల్లి లింగారెడ్డి(68) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు ఇంట్లో కింద పడి మృతి చెందాడు. ఎస్సై రాజు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగారెడ్డి గ్రామంలో కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. కాగా గురువారం ఇంట్లో లింగారెడ్డిని ఉంచి వ్యవసాయ పనులకు కుటుంబ సభ్యులు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి లింగారెడ్డి కిందపడి మృతిచెంది ఉన్నాడు. మృతుడి కొడుకు లక్‌పతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యమివ్వాలి

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డీఈవో రాము సూచించారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పాఠశాలల బాలబాలికల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్, ఎంపిక పోటీలకు ముఖ్యఅతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విశ్వప్రసాద్, అశోక్, ప్రధానోపాధ్యాయురాలు సరోజన, ఎంపీవో రవిబాబు ఉన్నారు.

ఏసీపీ మృతిపై విద్యార్థుల నివాళి

కథలాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదలో ఏసీపీగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విష్ణుమూర్తికి మండలంలోని పోతారం పాఠశాల విద్యార్థులు శుక్రవారం నివాళులర్పించారు. కథలాపూర్‌లో ఎస్సైగా పనిచేసిన సమయంలో అనేక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన విష్ణుమూర్తిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాలెపు వెంకటేశ్, ఏఎంసీ వైస్‌చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్, సిద్ధార్థ్, రవి, లక్ష్మీపతి తదితరులు ఉన్నారు.

గుడికోటలో తహసీల్దార్ పూజలు

రాయికల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని పురాతన దేవాలయమైన గుడికోటలో తహసీల్దార్ నాగార్జున స్వామివారిని శుక్రవారం దర్శించుకున్నారు. తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ పద్మయ్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ఎనుగందుల శ్రీనివాస్, బత్తిని నిరంజన్, సంకోజి అశోక్, పురోహితులు సాయి సుధీర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి హుండీ ఆదాయం 5.53 లక్షలు

బీర్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని శుక్రవారం అధికారుల సమక్షంలో లెక్కించారు. 5,53,403 రూపాయల ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ జగిత్యాల జిల్లా పరిశీలకులు రాజమౌళి, ధర్మపురి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, తిరుమల గ్రూప్ సేవ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో దీపావళి వేడుకలు

రాయికల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దీపావళి ఆకృతిలో కూర్చుని చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అఫ్సర్, షారు, సంజన, ఇందుజ, రజిత, మమత, సాయి హర్ష, మంజుల, స్రవంతి, కవిత, నిహారిక తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ తిరుపతిరావు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన

పెగడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తొమ్మిదో షెడ్యూల్‌లో పొందుపరిచి బిల్లును ఆమోదింపజేయాలని దళిత బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ శుక్రవారం డీహెచ్‌పీఎస్(దళిత హక్కుల పోరాట సమితి) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. శనివారం నిర్వహించనున్న బంద్‌లో దళిత హక్కుల పోరాట సమితి ప్రత్యక్షంగా పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇరుగురాల భూమేశ్వర్, ఆ సంఘం జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాచర్ల సురేష్, రాజశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా చొప్పరి అంజయ్య



మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా రంగారావుపేట మాజీ సర్పంచ్ చొప్పరి అంజయ్యను ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీం పట్నం, మల్లాపూర్ ముదిరాజ్ కులస్తులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోరుట్ల నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా అంజయ్యను ఎన్నుకున్నారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోమల చంద్రమౌళిని, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ అన్నమనేని ఆనంద్‌బాబు, న్యాయసలహాదారులుగా వెల్మల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా తోకల సత్యనారాయణ, అర్గనైజింగ్ సెక్రెటరీగా ఉరుమడ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జక్కం బాపు, కార్యవర్గ సభ్యులుగా నరేష్, సత్యనారాయణ, రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న క్యాంపస్ ఎకో బజార్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ పర్యావరణ అటవీ శాఖ మరియు పర్యావరణ మార్పుల శాఖ సూచనల మేరకు తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్పోరేషన్ సహకారంతో పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఎకో బజార్ కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు పలు పర్యావరణ రహిత వస్తువులను రూపొందించి సుమారు 15 స్టాళ్లను ఏర్పాటు చేయగా, వాటిని సందర్శించిన చైర్మన్ రామకృష్ణ స్టాళ్లను రూపొందించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అవస్థలే..

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు అవస్థలే ఎదురవుతున్నాయని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లలో సమస్యలు నెలకొన్నాయన్నారు. వీటిని పర్యవేక్షించే బాధ్యత రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఉంటుందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని దుస్థితి ప్రస్తుతం చూస్తున్నామని, రెండు సంవత్సరాల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్ బిల్లులు రాక స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను స్కూల్ నుంచి బయటకు పంపించారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసి, కలెక్టర్లకు వినతిపత్రం అందించే దుస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ అభివృద్ధిని పక్కనబెట్టి అవగాహన లేని ఆరోపణలు చేశారన్నారు. మంత్రిగా పనిచేస్తున్న లక్ష్మణ్‌కుమార్ ధర్మపురి నియోజకవర్గంలో తట్టెడు మట్టి కూడా పోయలేదని విమర్శించారు. ధర్మపురిలో ఎంతో అభివృద్ధి చేశానని మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతున్నారని, ఇలా కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు అలవాటు మారిందని విమర్శించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని తెలిపారు. గురుకుల పాఠశాలలకు కాంట్రాక్టు ద్వారా కోడి గుడ్లు చికెన్, మటన్ సరఫరా చేసే వారికి బిల్లులు రాక సరఫరా నిలిచిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, కేడీసీసీ ప్రెసిడెంట్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్